క్లుప్తంగా

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా రవివర్మ



టేకుమట్ల: బహుజన సమాజ్‌వాది పార్టీ మండల అధ్యక్షుడిగా మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన సంగి రవివర్మను బుధవారం నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం రవివర్మ మాట్లాడుతూ నాపై నమ్మకంతో అధ్యక్ష పదవి అప్పగించిన జిల్లా అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో ఈసీ సభ్యులు సంగి రవి, ఆరుముళ్ల రాజు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లపై స్పెషల్ డ్రైవ్



కాటారం : రోడ్డు రవాణా నిబంధనలు అతిక్రమించిన వాహనాలకు విధించిన జరిమానాకు సంబంధించిన పెండింగ్ చలాన్లపై పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు ఎస్సై మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేపట్టారు. జరిమానా చలాన్లు చెల్లించకుండా ఉన్న పలు వాహనాలను గుర్తించి చలాన్లు చెల్లింపులు చేయించారు. 41 వాహనాలకు సంబంధించిన రూ.21,500 ఆన్‌లైన్ ద్వారా సదరు వాహన యజమానుల ద్వారా చెల్లింపజేసినట్లు ఎస్సై తెలిపారు. వాహనదారులు చలాన్లు చెల్లించకుంటే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కాటారం : మహాముత్తారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బానోత్ జగన్‌నాయక్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పాల్గొన్నారు. జగన్‌నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మార్క రాము గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

టిప్పర్లు స్వాధీనం

టేకుమట్ల: మండలంలోని కలికోట శివారు మానేరు నుంచి ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న రెండు టిప్పర్లను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి మానేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవెన్యూ, పోలీసులు సోదాలు నిర్వహించగా మానేరులో ఒడ్డున ఇసుక డంపు వద్ద ఇసుక తరలింపుకు సిద్ధంగా ఉన్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు, ఓనర్లు బత్తుల రాములు, దండుగుల రవి, వంశీ, అజయ్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హమాలీ కార్మికుల అరెస్ట్



చిట్యాల : మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో సివిల్ సప్లయ్ కార్యాలయ ముట్టడి నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు కార్మికులు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌కు వెళ్తున్నారనే సమాచారం తెలుసుకుని మమ్ములను అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. హమాలీలు సురేష్, శ్రీనివాస్, సమ్మయ్య, నర్సయ్య, ఐలయ్య, పాల్గొన్నారు.

రేగొండలో దొంగల హల్‌చల్

రేగొండ : మండలంలోని పలు గ్రామాల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 13న మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఉన్న లారీ డీజిల్ ట్యాంక్ పగలగొట్టి 200 లీటర్ల డీజిల్‌ను దుండగులు దొంగిలించారు. అలాగే రైతు పొలాల వద్ద ఉన్న హార్వెస్టర్‌ల నుంచి కూడా దొంగలు డీజిల్ ఎత్తుకెళ్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే నాలుగు రోజుల క్రితం మండలంలోని కొత్తపల్లి బీ గ్రామసమీపంలోని భూతం బాలకృష్ణకు చెందిన వ్యవసాయ భూమిలో ఉంచిన ట్రిల్లర్‌ను ఎవరో ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలోని ఓ రైతుకు చెందిన విద్యుత్ స్టార్టర్ పెట్టెను ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలో పరకాల-భూపాలపల్లి జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న రెండు టిప్పర్ల నుంచి డీజిల్ చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

పొగమంచుతో అధిక ప్రమాదాలు

- రాత్రి పూట ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- జైపాల్‌రెడ్డి, సీనియర్ ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ





ఖిలా వరంగల్: ప్రస్తుతం విపరీతమైన చలితోపాటు పొగ మంచు కురుస్తోంది. రహదారులను కమ్మేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫాగ్ లైట్లు వాడితే 25మీటర్ల వరకు స్పష్టంగా చూడొచ్చు. నాలుగు చక్రాల వాహనం ఒకే లైటుతో ప్రయాణిస్తే ఎదురుగా వచ్చే వారు ద్విచక్ర వాహనమనుకుని, పక్కనుంచే వెళ్లే అవకాశం ఉంది. రెండు హెడ్‌లైట్లు డిప్ చేస్తూ ప్రయాణించాలి. మూలమలుపుల వద్ద అతివేగం పనికి రాదు. వాహనాలను ఓవర్‌టేక్ చేయడం వల్ల ఎదురుగా వచ్చేవి కనిపించవు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెనుక లైట్లు వెలిగేలా చూసుకోవాలి. పొగ మంచులో కాంతి పరావర్తనం చెంది ఎదురు వాహనాలు కనిపించవు. వాహనానికి ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు అతికించాలి. రహదారిని చూడగలిగే పరిస్థితులకు అనుగుణంగా వాహన వేగం ఉండాలి. ఇతర వాహనదారులు తమను గమనించేలా హజార్డ్ లైట్ వాడాలి. లోబీమ్ ఫాగ్ లైట్లు ఉండేలా చూడాలి. నేషనల్ హైవే, శివారు రహదారులపై వాహనాల మధ్య కచ్చితంగా దూరం పాటించాలి.

చిప్‌లు గట్టిపడి పనితనం మందగిస్తుంది

- మంచుకురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ ఉపయోగించొద్దు
- మయూర్, ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్, హనుమకొండ



హన్మకొండ చౌరస్తా: ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలలో పడిపోయినప్పుడు కంప్యూటర్లు, మొబైళ్లు, బ్యాటరీ, ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్లలో ఉండే మెటల్ కాంట్రాక్ట్‌లు ప్రభావితం అవుతాయి. ఎలక్ట్రానిక్స్ వస్తువుల లోపల ఉండే చిప్‌లు మైనస్ టెంపరేచర్‌లో గట్టిపడి పనితనం మందగిస్తుంది. అయితే బయటి దేశాలతో పోల్చితే ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాల్లోని చలితీవ్రత చాలా తక్కువగా ఉంటుందని చెప్పొచ్చు. దీని వల్ల ఎలక్ట్రానిక్స్ వస్తువులపై అంతగా ప్రభావం ఉండదు. అలాగని మంచు కురిసే సమయంలో బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైళ్లను వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. నీటి తడితో విడిభాగాలు పూర్తిగా పాడవుతాయి. మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం మంచిది. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు కంప్యూటర్లు, మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడి భాగాలపైన కొంత ప్రభావం చూపుతుంది తప్పితే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై ఎలాంటి ప్రభావం ఉండదు. కీప్యాడ్ మొబైళ్లు కొంత బిగుసుకుపోయే అవకాశం ఉంటుంది. ఇప్పుడంతా స్మార్ట్ ప్రపంచం. మొబైల్ బాగా వేడి అయినప్పుడు స్విచ్‌ఆఫ్ చేయడం మంచిది.

నష్టాన్ని మిగిల్చిన పత్తిసాగు

- దిగుబడి రాలేదు.. ధర లేదు
- ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లే
- లబోదిబోమంటున్న రైతులు



జూబ్లీనగర్‌లో సాగు చేసిన పత్తి చేను

రేగొండ : ఈ ఏడాది పత్తి సాగు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఎంతో కష్టపడి వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటను సాగుచేస్తే చేసిన కష్టం, దిగుబడి ఏమో కానీ కనీసం పెట్టుబడి రాకపోగా అప్పుల పాలు చేసింది. వచ్చిన కొద్ది పంటకైనా మార్కెట్‌లో సరైన ధర వస్తుందనుకుంటే నాణ్యత లేదనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు చేశారు. దీంతో ఎటూ పాలు పోని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని 37 జీపీల పరిధిలో 14,256 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఎకరానికి 10 క్వింటాళ్ల చొప్పున 1,46,256 క్వింటాళ్ల పత్తి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. సాగుకోసం రైతులు వివిధ కంపెనీల పత్తి విత్తనాలు కొనుగోలు చేసి విత్తారు. సాగైన పత్తి పంటకు దుక్కులు దున్నిన నాటి నుంచి ఎరువులు, పురుగు మందులు, కూలీలకు కలిపి ఎకరాకు సుమారు రూ. 30 వేల పెట్టుబడి అయింది. మొదట్లో సాగు బాగానే ఉన్నప్పటికీ ఆ తర్వాత పూత, కాత దశలో అకాల వర్షాలతో పాటు వాతావరణ పరిస్థితులతో తెగుళ్లు ఆశించి పత్తి కాయలు రాలిపోయాయి. దీంతో ఒక్కో చెట్టుకు 15–25 కాయలు మాత్రమే మిగిలాయి. ఉన్న పంటను కూలీల ద్వారా తీయిస్తే ఒక్కో ఎకరాకు మూడున్నర నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. కనీసం పెట్టుబడి అయినా వస్తుందేమో అనుకుంటే మార్కెట్‌లో నాణ్యత లేదనే సాకుతో క్వింటా పత్తికి రూ. 6,500 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వచ్చిన పైసలు కూలీలకే సరిపోతున్నాయన్నారు. ఈ ఏడాది పత్తిసాగుతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి..

వర్షాలకు పత్తి చేలల్లో కలుపుతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏకదాటి వర్షాలతో కలుపు తీవ్రంగా పెరగడంతో పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కలుపు మొక్కలను తొలగించేందుకు కూలీలకు ఒక ఎకరాకు రూ. 4 నుంచి రూ. 5 వేల వరకు ఖర్చయ్యే అవకాశం ఉండటంతో ఎకరాకు రూ.1000 నుంచి రూ. 2 వేల వరకు ఖర్చు చేసి పలువురు రైతులు కలుపు మందును పిచికారీ చేశారు. అయినా పూర్తిస్థాయిలో నివారణ కాలేదు.

ఐదు ఎకరాల్లో సాగు చేశా..



ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. మొదట్లో వర్షాలు సరిగా పడకపోవడంతో మొక్కల్లో ఎదుగుదల తగ్గిపోయింది. మొదట్లో వేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో రెండు, మూడు సార్లు విత్తనాలు వేయాల్సి వచ్చింది. ఎడతెరిపి లేని వర్షాలతో మొక్కలు ఎర్రబడి ఎదుగుదల ఆగిపోయింది.

- వన్నాల శివాజీ, కొత్తపల్లిగోరి

రూ.70 వేల పెట్టుబడి పెట్టాను



మూడున్నర ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ఇప్పటి వరకు రూ.70 వేల పైనే పెట్టుబడి అయింది. వర్షాల కారణంగా పత్తి చేలలో నీరు నిలిచి మొక్కలు ఎర్ర బారాయి. ఇప్పటి వరకు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా పత్తికి ప్రభుత్వం రూ. 10 వేలు చెల్లించి రైతులను ఆదుకోవాలి.

- జంగేటి సంజీవ్, జూబ్లీనగర్

డీఎస్పీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు



దీక్షలో పాల్గొన్న ధర్మసమాజ్ నాయకులు

భూపాలపల్లి రూరల్: విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధన కోసం ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ బుధవారం అంబేడ్కర్ సెంటర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. బీసీ నాయకులు భీమనాదుని సత్యనారాయణ, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు కేతిరి రమేష్, లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు లావుడ్య మధుకర్ నాయక్, ఎస్సీ, ఎస్టీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఆశడపు రంగయ్యలు రవీందర్‌కు పూల మాలలు వేసి దీక్షను ప్రారంభించారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ మాట్లాడుతూ విద్య, వైద్యం అందరికి ఉచితంగా అందించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులను కాపాడేందుకు వ్యవస్థాపక అధ్యక్షుడు విశారధన్ మహారాజ్ ఆదేశానుసారం ఆమరణ నిరాహార దీక్ష చేట్టామన్నారు. దీక్షలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి, ఉపాధ్యక్షులు చిట్యాల శ్రీనివాస్, వివిధ మండలాల నాయకులు పుల్ల అశోక్, శ్యామ్, స్వామినాధన్, అంగిడి ఓదెలు, దూడపాక శ్రీకృష్ణ, వడ్డేపల్లి శ్రీనివాస్, పంగ మహేష్, చిర్ర శ్రీకాంత్, మంతెన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

రేగొండ : డ్రెయినేజీలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని నోటీసులు పంపిన స్పందించకపోవడంతో అధికారులు బుధవారం అక్రమ నిర్మాణాలను తొలగించారు. మండల కేంద్రంలోని పెద్ద బస్టాండ్ వద్ద పరకాల-భూపాలపల్లి జాతీయ రహదారికి ఇరువైపుల డ్రెయినేజీ లైన్ నిర్మించారు. ఈ నిర్మాణాలపై కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. అలాగే మురుగునీరు ముందుకు ప్రవహించక పోవడంతో నీరంతా రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో ఆ దారి గుండా వెళ్లే పాదచారులు ఇబ్బందులు ఎదుర్కోగా, పలువురు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అధికారులు స్వచ్ఛందంగా తొలగించాలని నోటీసులు పంపినా స్పందించక పోవడంతో గ్రామపంచాయతీ అధికారులు పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి ఆక్రమణలు తొలగించారు. ఈ క్రమంలో ఓ షాపు యాజమాని పోలీస్‌లతో వాగ్వాదానికి దిగాడు. దీంతో అతనిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి తుల్ల రాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉంచాలి



సర్వేను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్

భూపాలపల్లి అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఆవరణలను పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిశుభ్రంగా ఉంచాలని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి ఆదేశించారు. బుధవారం ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన మౌళిక సదుపాయాలు కల్పించడంలో అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా మరమ్మతు ఉన్నచో వాటిని వెంటనే రిపేర్లు చేయాలని మునిసిపల్ కమిషనర్ ఆదేశించారు. అంతకు ముందు పట్టణంలోని పలు కాలనీల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు.

లంబాడ జాతి అభివృద్ధికి కృషి

- సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్



ర్యాలీలో పాల్గొన్న సేవాలాల్ సేనా నాయకులు

భూపాలపల్లి రూరల్ : లంబాడ జాతి అభివృద్ధికి కృషి చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు నాయక్ అన్నారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఏక్ సాత్ ఏక్ వాత్ ప్రజా రగ్ జోల్ యాత్ర బుధవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్య సురేష్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లాలోని గిరిజనులంతా యాత్రకు మంజూర్‌నగర్‌లో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాంబాబు నాయక్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజారగ్ జోల్ యాత్ర మహబూబాద్, ఖమ్మం, వరంగల్, ములుగు మీదుగా బుధవారం నాటికి 11వ రోజు భూపాలపల్లికి చేరుకుందన్నారు. తెలంగాణలో అగ్రకుల నాయకులు అధికారాన్ని చెలాయిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఓటు బ్యాంకుగా గుర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఉద్యోగాల ఊసే లేదని, సేవాలాల్ సేన 27 డిమాండ్లతో యాత్ర చేస్తుందని, తక్షణమే డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. సేవాలాల్ సేన విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ సంతోష్ నా యక్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శారదా బాయి, జిల్లా ప్రధాన కార్యదర్శులు వాలునాయక్, రామస్వామి నరేష్ నాయక్, సేవాలాల్ సేన నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

బాలయ్యకు సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న బాలయ్య

మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన నారా బాలయ్యకు సేవారత్న జాతీయ అవార్డు వరించింది. ఈ మేరకు ఢిల్లీలోని బహుజన సాహిత్య అకాడమీ వారు మంగళవారం ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ చేస్తున్న సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ వారు సేవారత్న జాతీయ అవార్డు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డుకు సహకరించిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

భూపాలపల్లి అర్బన్: భూమి కొలతలు, రికార్డ్స్ అధికారుల భూపాలపల్లి, ములుగు జిల్లాల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు టీఎన్‌జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు బూర్గు రవి తెలిపారు. రెండు జిల్లాల అధ్యక్షుడిగా రాజా రమేష్, ఉపాధ్యక్షులుగా గంగాధర్, కే. శ్రీదేవి, కార్యదర్శిగా ప్రభాకర్, సహాయ కార్యదర్శులుగా సుచిత్ర, వినయ్‌కుమార్, కోశాధికారిగా పరమేశ్వర్, కార్యనిర్వహక కార్యదర్శిగా రామకృష్ణ, ప్రచార కార్యదర్శిగా తిరుపతి, సభ్యులుగా అర్జుమాన్, నిరంజన్‌లు నియమితులయ్యారు.

గుడుంబా పట్టివేత

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో 10 లీటర్ల గుడుంబాను ఎస్సై పవన్‌కుమార్ తన సిబ్బందితో కలిసి బుధవారం పట్టుకున్నారు. మహదేవపూర్‌లో గుడుంబా విక్రయిస్తున్న సమాచారంతో అంబట్‌పల్లికి వెళ్లి బండం రమేశ్ కిరాణ షాపు వద్ద తనిఖీలు చేపట్టారు. 10 లీటర్ల గుడుంబా నిల్వ ఉన్నట్లు దొరికింది. అతనిపై కేసు నమోదు చేసి గుడుంబాను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాజకీయ లబ్ధికోసమే ఆరోపణలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి



కాటారం : మాట్లాడుతున్న నాయకులు



పలిమెల : మాట్లాడుతున్న చిన్నన్న

కాటారం : మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తన రాజీకయ లబ్ధికోసమే కాంగ్రెస్ పార్టీ, మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలిమెల మండలంలోని భూముల విషయంలో పుట్ట మధు చేస్తున్న ఆరోపణలు దొంగే దొంగల్లో కలిసి దొంగా దొంగ అన్న చందంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీధర్‌బాబు మంత్రిగా ఉన్నప్పుడు పలిమెల భూవివాదం ఆయన దృష్టికి రావడంతో రికార్డులను న్యాయనిపుణలతో పరిశీలన చేయించారని తెలిపారు. పుట్ట మధు, బీఆర్ఎస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. సమావేశంలో మహిళా అధ్యక్షురాలు మహేశ్వరీ, యూత్ అధ్యక్షుడు మహేశ్, రమేశ్, అశోక్, విక్రమ్, పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

పలిమెల : స్థానిక ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోదరుడికి దక్కన్ సిమెంట్ కంపెనీలో 50 శాతం వాటా ఉందని కాంగ్రెస్ నాయకులే రైతుల భూములను కంపెనీకి కట్టబెట్టారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తమని, అసత్యప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండెబోయిన చిన్నన్న అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ రిజిస్ట్రేషన్ల పై మంత్రి శ్రీధర్ బాబు స్పందించి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలి పారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి వెంకటస్వామి,మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సారయ్య, పాల్గొన్నారు.

'పుట్ట మధు ఆరోపణలు అవాస్తవం'

కాళేశ్వరం: పలిమెల మండలం దక్కన్ సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేసిన భూముల్లో మంత్రి శ్రీధర్ బాబు, అతని సోదరుడు శీనుబాబులకు వా టా ఉందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ చేసిన ఆరోపణలు అవాస్తవం అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజ బాబుల ఆధ్వర్యంలో ఆయన చేసిన ఆరోపణలను ఖండించారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి, నాయకులు విలాస్‌రావు, రామ్మోహన్, అశోక్, వామన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, షాహీన్, వరప్రసాద్,సుధాకర్ పాల్గొన్నారు.

వాహనం బోల్తా..

ఇద్దరికి గాయాలు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక శివారులో బుధవారం రాత్రి టాటాఏస్ వాహనం బోల్తా పడడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మండలంలోని అందుకుతండాకు చెందిన భూక్యా సతీష్, దామర శెట్టి వీరయ్యలతో పాటు మరో ఇద్దరు రాంనర్సయ్య, లింగమూర్తిలు పరకాలకు వారి వ్యక్తిగత పనినిమిత్తం వెళ్లి తిరుగు వస్తున్న క్రమంలో నైన్‌పాక శివారులోని మలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే 108కు సమాచారం అందించారు. అనంతరం 108 వాహన సిబ్బంది క్షతగాత్రులను చిట్యాల ఆసుపత్రికి తరలించారు.

ఏటీసీ సేవలు అభినందనీయం

- ఎంఈఓ ఉప్పలయ్య



క్రీడాకిట్లు అందజేస్తున్న ప్రతినిధులు

గణపురం : విద్యాభివృద్ధిలో అల్బెనీ తెలంగాణ కమ్యూనిటీ (ఏటీసీ) న్యూయార్క్ సేవలు అభినందనీయమని ఎంఈఓ ఉప్పలయ్య అన్నారు. మండలకేంద్రానికి చెందిన గర్రెపెల్లి శివశంకర్ కుమారుడు ఎన్ఆర్ఐ శిధర్ నేతృత్వంలో సంస్థ ప్రతినిధులు గర్రెపెల్లి తిరుపతమ్మ, బలిదె వెంకటేశ్వర్లు దంపతులు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.50 వేలతో స్పోర్ట్స్, మ్యాథమెటిక్స్ మెటీరియల్, సౌండ్ సిస్టమ్‌ను అందచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడినా పుట్టినగడ్డపై మమకారంతో శిధర్ తమ ఏటీసీ సంస్థ ద్వారా పాఠశాలను దత్తత తీసుకొని విద్యార్థులకు విలువైన సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేసు సతీష్‌కుమార్, ఎంపీపీఎస్ హెచ్‌ఎం దూలం కుమారస్వామి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన గురుకులం విద్యార్థినులు

కాటారం: సీఎం కప్-2024 జిల్లా స్థాయి పోటీల్లో మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల అప్‌గ్రేడ్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. పోటీల్లో భాగంగా పలు విభాగాల్లో విద్యార్థినులు సత్తా చాటారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, డిస్కస్ త్రో, బేస్‌బాల్ విభాగాల్లో ప్రథమ స్థానం, షార్ట్‌పుట్ ద్వితీయ స్థానం, లాంగ్ జంప్ ప్రథమ, ద్వితీయ, 100, 400 రన్నింగ్ రేస్‌లో పాఠశాల ప్రథమ స్థానంలో గెలుపొందారు. విద్యార్థినులు జిల్లా స్థాయిలో రాణించడంపై పీడీ గౌతమి, పీఈటీ శ్రీవిద్యను ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ సరిత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ కల్పన ప్రత్యేకంగా అభినందించారు.